'నవ్య' వారపత్రిక - 19-01-2005

# మెలిక

పన్నెండుమంది సభ్యులు కల ఆ సాంస్కృతిక బృందం అమెరికాకి తూర్పు ద్వారమైన న్యూయార్క్ నగర కెన్నడీ విమానాశ్రయంలో దిగింది. నడివయసులో ఉన్న నలుగురు ఆడసభ్యులకీ, ఎనమండుగురు మగసభ్యులకీ తనువులు పులకరించి పోయాయి.

"భూతలం మీద నుంచి అనేకమంది మహర్షులు దైవలోకాలనన్నింటినీ మాటిమాటికి సందర్శించి వచ్చారని చదివినా, నాకు తెలుసున్నంత వరకూ బొందితో స్వర్గం చేరినవాడు ధర్మరాజొక్కడే!" అన్నాడు సందీప్ అగర్వాల్.

"అంటే నీ ఉద్దేశ్యం మనమందరమూ భూతల స్వర్గమనుకొనే అమెరికాలో అడుగు పెట్టామనా? ఇంద్రుడు చేసిన అరాచకపు పనుల వల్ల స్వర్గానికి అప్రతిష్ఠ కలిగింది కాని మరోటి కాదు. అమెరికా అంటే భూతలస్వర్గమనుకొనే నీ భావదాస్యానికి చింతిస్తున్నాను!" అన్నాడు బిబేక్ బెనర్జీ. మనసులోని మర్మాన్ని తెలియనివ్వకుండా మాటలు చెప్పడంలో దిట్ట బెనర్జీ.

"బయలుదేరకమునుపు అక్కడ ఢిల్లీలో జరిగిన వాగ్వివాదం చాలు. పరాయి దేశంలో నోరు అదుపు తప్పితే అపహాస్యం పాలవుతాం. పరస్పర సంస్కృతీ అవగాహనే మన ధ్యేయం. రాజకీయపరమైన అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యడానికి రాలేదు మనం. అయినా దేశ సంబంధాల విషయమే ప్రధానంగా కొందరు ఇబ్బంది కరమైన ప్రశ్నలు వెయ్యవచ్చు. లౌక్యంగా కప్పదాటు సమాధానాలు చెప్పండి. లేదా నా వైపు చూడండి. బృంద నాయకుడిగా నేను సమాధానం చెబ్తాను" అన్నాడు మాధవ్ షిండే.

"సరేనయ్యా మహానుభావా! నువ్వు మా బృందనాయకుడవని మాటిమాటికి గుర్తుచెయ్యవలసిన అవసరం లేదు" అన్నాడు మారుతీరావు చిన్నగా నవ్వుతూ.

"ఆయా రాష్ట్రాల ప్రతినిధులుగా మన మందరమూ, రాజకీయ నాయకుల సిఫారసులను ఉపయోగించుకునే ఈ బృందంలో సభ్యులుగా రాగలిగాం. ఇక్కడేదైనా గొడవ జరిగిందంటే తిరిగి వెళ్లిన తర్వాత పత్రికలు దుమ్మెత్తి పోస్తాయి. అందుకని, అందరూ జాగ్రత్తగా ఉండడం మంచిదే" అంది అనితా పాండే కళ్లతో అభినయాన్ని జోడిస్తూ. ఆ మాట వాస్తవమైనా మిగిలిన సభ్యులకి అది రుచించలేదు. 'షిండేకి చెంచా' అనుకొన్నారు మనసులో.

కెన్నెడీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయటపడి, బ్రానిఫ్ ఎయిర్‌వేస్ టెర్మినల్‌కి వెళ్లి, న్యూ మెక్సికో రాష్ట్రంలోని 'శాంటాఫే'కి వెళ్లే విమానం ఎక్కారు. అమెరికా మధ్యప్రాంత కాలమాన ప్రకారం రాత్రి తొమ్మిదింటికి చేరుకొని, ఊరి శివార్లలో ఏర్పాటు చేయబడ్డ 'వుడ్‌పెకర్' మోటల్‌లో బసచేశారు. జెట్‌లాగ్ మూలాన ఆ రాత్రి అందరికీ, రాని నిద్ర కోసం కుస్తీ పట్టవలసివచ్చింది.

ఆ మర్నాటి ఉదయం నుంచి నిర్ధారితమైన ప్రదేశాల్లో పరస్పర అవగాహనా సదస్సులు జరిగాయి. ఆ సందర్భంగా ఆ బృందం న్యూ మెక్సికో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్ని సందర్శించింది. పెనవేసుకొన్న స్పానిష్, అమెరికన్ సంస్కృతుల సమ్మేళనం కట్టడాల్లోనూ, మనుషుల ప్రవర్తనలోనూ కనబడింది. మట్టిగోడల నిర్మాణాలూ, వాటిలోనే అద్భుతమైన హోటళ్లూ, ప్రదర్శన శాలలూ బృందాన్ని ఆకర్షించాయి. పగటిపూట కూడా నిద్రపోతున్నట్టున్న లాస్ అలామోస్ పట్టణంలో మొదటి అణ్వస్త్ర రూపకల్పన జరిగిందనీ, అక్కడ డెభై శాతంకి పైగా డాక్టరేట్ పట్టాలున్నవారనీ, అక్కడ రాత్రిపూట వీధి దీపాలు వెలిగించరనీ తెలుసుకొన్నప్పుడు – అల్బ్యుకర్కీ నగరంలో అమెరికన్ విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల పరిజ్ఞానమంతా పొందుపర్చబడిన భూగర్భ కంప్యూటర్ కేంద్రముందనీ, ఒకవేళ ప్రపంచ నాశనం జరిగినా తర్వాత ఉద్భవించే నూతన మానవాళికి ఆ విజ్ఞానమంతా మొదటి మెట్టులోనే అందుబాటుగా ఉంటుందనీ తెలుసుకున్నప్పుడు భారతీయ బృందం ఆశ్చర్యపోయింది.

తిరుగుప్రయాణానికి రెండు రోజుల ముందుగా, బృందం శాంటాఫే చేరుకొంది. ఆతిథ్యమిచ్చిన సంస్థ ఏర్పరిచిన మార్గదర్శకుడు డేవిడ్ అన్నాడు.

"మీ కార్యక్రమం దిగ్విజయంగా జరిగిందనే అనుకొంటాను. ఈ శనాదివారాలు రెండు రోజులూ చుట్టుపక్కలనున్న కొన్ని పర్యాటక స్థలాల్ని చూపిస్తాను. మిగిలిన ఒక్క ఆఖరి సమావేశం రేపు రాత్రి ఎనిమిదింటికి ఏర్పాటు చేశాను. సోమవారం ఉదయం మీరు న్యూయార్క్ ఫ్లైట్‌కి వెళ్ళవచ్చు. ఏమంటారు?"

అందరూ సరేనన్నారు. ఉదయం పదింటికి ఓ చిన్న బస్సులో డేవిడ్ అందర్నీ, శాంటాఫేకి ఓ గంట ప్రయాణ దూరంలో ఉన్న 'పొలాక్‌వేలీ' అనే గ్రామసమీపంలో ఉన్న ఓ చిన్న కొండ మీదకి తీసుకువెళ్లాడు. అక్కడున్న మట్టిగోడల ప్రాకారాన్ని చూడగానే బిబేక్ బెనర్జీలో ఏదో

సంచలనం కలిగింది. పక్కనే నడుస్తున్న అనితా పాండేతో అన్నాడు.

"ఈ ప్రాంతంతో నాకు పరిచయమున్నట్టూ, ఇదివరకు చూసినట్టూ అనిపిస్తోంది."

"నీకేమైనా మతిపోయిందా? కోల్‌కతాలో పుట్టి పెరిగినవాడివి.....?" అనితా పాండే మధ్యలో ఆపేసింది.

"నేనిదివరలో రష్యా వెళ్లిన సంగతి నీకు తెలియదు. అమెరికా రావడం యిదే మొదటిసారైనా ఈ ప్రాంతాన్ని చూసిన అనుభూతి కలుగుతోంది! సీరియస్‌గానే చెబుతున్నాను" అన్నాడు బెనర్జీ.

మరో పక్కన నడుస్తున్న డేవిడ్ అన్నాడు.

"ఒక్కొక్కప్పుడు చూడబోయే ప్రదేశాలు కలల్లో ముందుగా కనబడ్తాయి. అందుకని కొన్ని ప్రాంతాలను యిదివరలో చూసిన అనుభూతి కలుగుతుంది. లోపలికి పోదాం, పదండి."

లోపల ఓ పెద్ద మండువా లోగిలి. ఇంటికి బయటి ఆవరణలోనూ, లోపల మండువా వైపునా, చుట్టూరా పెంకులతో దింపిన వసారాలున్నాయి. ముందుభాగంలో లోపలి ప్రాంగణంలోకి వెళ్లే ద్వారాని కిటూ అటూ రెండేసి గదులున్నాయి. మిగిలిన మూడు వైపులా అయిదేసి గదులున్నాయి. ప్రతి గదికీ లోపలి వసారాలోకే గుమ్మాలున్నాయి. గదుల నిండా చాలా పురాతన వస్తువులూ, కళాకృతులూ ఉన్నాయి. వారాంతపు సెలవు దినం కాబట్టి చాలామంది అమెరికన్ దర్శకులు తీరుబడిగా అన్నీ చూస్తూ తిరుగాడుతున్నారు.

"ఇది రాండాల్ వుల్ఫ్ అనే సంఘసేవకుడు రెండు వందల సంవత్సరాల క్రితం నివసించిన ఇల్లు. అతను జీవితమంతా సమాజసేవకే నిస్వార్థంగా అంకితం చేశాడు. అతని పేరిట ఈ చిన్న ప్రదర్శనశాల స్థాపించడం జరిగింది. వెనక వసారా మధ్యగదిలో అతని కంచువిగ్రహం ఉంది పదండి, చూద్దాం" అన్నాడు డేవిడ్.

అందరూ ఆ గదిలో ప్రవేశించారు. అమెరికన్ దర్శకులతో ఆ గది సందడిగా ఉంది. ఆ పురావస్తు ప్రదర్శనశాల పరిరక్షకుడు థామ్సన్ చెప్పుకొంటూ పోతున్నాడు.

"వివక్ష లేకుండా ఎంతోమంది మెక్సికన్ శరణార్థులకు ఆశ్రయమిచ్చాడు. స్థానిక రెడ్ఇండియన్ హక్కులకోసం పోరాడాడు. ఇది కిట్టని ఎవరో అతన్ని గొడ్డలితో నరికి చంపారు. హంతకుడి జాడ తెలియలేదు. గ్రామస్థులందరూ తలో బంగారు నాణెమూ ఓ కంచుపాత్రలో వేసి, సీలు వేసి, హంతకుని ఆచూకీ తెలిపి పట్టించిన వారికి ఇవ్వాలని నిశ్చయించుకున్నారు. పక్కనున్న ఈ అద్దాల బీరువాలోని కంచుపాత్ర అదే! హత్యాయుధం గొడ్డలి కూడా కంచుపాత్ర వెనకాల ఉంది చూడండి."

"అందులో ఎన్ని బంగారు నాణేలున్నాయి? ఈలోపు దాన్ని తస్కరించడానికి ఎవరూ ప్రయత్నించలేదా?" - ఓ అమెరికన్ దర్శకుడు అడిగాడు.

"ఏమో, ఎవరికి తెలుసు? ఈ ట్రస్ట్ ఎప్పుడూ దాన్ని తెరిచి చూసే ప్రయత్నం చెయ్యలేదు. దాన్ని దొంగిలించే ప్రయత్నం ఇంతవరకూ జరగలేదంటే, అది మీరన్నట్టుగా ఆశ్చర్యకరమైన విషయమే!" అన్నాడు థామ్సన్.

"అందులో ఎన్ని నాణేలున్నాయో నాకు తెలుసు. సరిగ్గా నూట దెబ్బై రెండు!" అన్నాడు బెనర్జీ.

అందరూ బెనర్జీ వైపు వింతగా చూశారు. మాధవ్ షిండే బెనర్జీని మందలించాడు.

"వెర్రివాగుడు వాగకు, అందరూ నవ్వుతారు."

"వెర్రివాగుడు కాదు, సీరియస్‌గానే చెబుతున్నాను!" అన్నాడు బెనర్జీ గంభీరంగా.

అక్కడున్న అమెరికన్లలో కుతూహలం పెరిగింది. డేవిడ్ వారందరికీ ఇండియానుంచి వచ్చిన సాంస్కృతిక బృందం వివరాలు చెప్పాడు. కొంతమంది పత్రికల్లో చదివామన్నారు. డేవిడ్ పరిచయం ముగిసిన తర్వాత థామ్సన్ బెనర్జీని మర్యాదగా అడిగాడు - "మీకెలా తెలుసు నాణేలెన్నివున్నాయో?"

"అప్పుడా నాణేలు వేసిన వారిలో నేనూ ఒకణ్ణి! బంగారు నాణేలకి ఒక వైపున త్రిభుజం, మరో వైపున చతుర్భుజం బొమ్మలుంటాయి. నేను వేసిన నాణెం చతుర్భుజం మధ్యలో ఒక మేకుతో ఇంటూ మార్క్ వేశాను. కావాలంటే తెరిచి చూడండి!" అన్నాడు బెనర్జీ.

"మీరిక్కడ దర్శకుల మధ్య తమాషా చేసి ఆ కాసులెన్ని ఉన్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అవునా?" అన్నాడు థామ్సన్ నవ్వుతూ.

"మిమ్మల్నెలా నమ్మించాలో తెలియట్లేదు! సరే, చెప్పరాని ఓ సంగతి చెప్పక తప్పదు. అందరూ అనుకొంటున్నట్టుగా రాండాల్ వుల్ఫ్ మంచివాడు కాదు. గోముఖవ్యాఘ్రం! అతను నా సోదరిని బలాత్కరం చేసి ఆ తర్వాత హత్య చేసి ఆమె దేహాన్ని ఈ ఇంటి వెనక కొండ కింద భాగంలో ఎర్రమద్దిచెట్టు దగ్గర పాతిపెట్టేశాడు. అప్పుడామె మెళ్లో ఓ రంగురంగుల రాళ్ల హారమూ, కుడిచేతి ఉంగరపు వేలికి ఓ పగడపు ఉంగరమూ ఉన్నాయి. అప్పటికి నాకు పదిహేనేళ్లు. నా మాట మా మెక్సికన్లు ఎవరూ నమ్మ సాహసించరనీ, నమ్మినా నిలదీసి అడిగే ధైర్యముండదనీ మౌనంగా ఉండిపోయాను. అక్కనెవరో అపహరించుకుపోయారనీ, లేదా ఎవరితోనో లేచిపోయిందనీ కొన్ని ఊహాగానాలు చేసి ఊరు ఆ సంగతి మరిచిపోయింది. ఓ రోజున రాండాల్ వుల్ఫ్ ఒంటరిగానూ, ఏమరుపాటుగానూ ఉన్న సమయం చూసి వెనుక నుంచి ఒక్క గొడ్డలివేటు వేశాను. అది అతని ఎడమ భుజం కంటె ఎముకను చీల్చుకుంటూ పోయి గుండెని ఖండించింది. నలుగురితో బాటు నేనూ మొసలి కన్నీళ్లు కార్చి, ఓ బంగారు నాణేన్ని కంచుపాత్రలో వేశాను. నాణేలు లెక్కబెట్టి సీలు వేసినప్పుడు నేనక్కడే ఉన్నాను. పాత్ర తెరచి చూడండి. నేను చెప్పిన చెట్టు దగ్గర, చెట్టు మొదలుకి పదడుగుల దూరంలో తూర్పు వైపున తవ్వి చూడండి..."

ఆ మాటలని బెనర్జీ స్పృహతప్పి పడిపోయాడు.

"రాండాల్ వుల్ఫ్ హత్య గొడ్డలితో జరిగింది. అలానే!" అన్నాడు థామ్సన్.

బెనర్జీ చెప్పినట్టుగా చేసి తీరవల్సిందే అని అక్కడున్న అమెరికన్ దర్శకులు పట్టు పట్టడంతో థామ్సన్ తన సెల్‌తో పొలాక్ వేలీ పోలీసు స్టేషన్‌కీ, న్యాయవ్యవస్థ అధికారులకీ ఫోన్ చేశాడు

అరగంటలోగా రెండు కార్లలో అధికారులు వచ్చారు. సంగతి వివరంగా తెలుసుకోవడంతో వాళ్ళలోనూ కుతూహలం రేకెత్తింది.

ముందుస్తుగా కంచుపాత్ర సీలు తొలగించి, మూత తీసి బోర్లించారు. ఇద్దరు దర్శకులు అందరి ఎదుటా విడివిడిగా నాణేల్ని లెక్కబెట్టారు. సరిగ్గా నూట డెభై రెండు! బెనర్జీ చెప్పినట్టుగా ఓ నాణెం చతుర్భుజంలో ఇంటూ మార్క్ కనబడింది. దర్శకులలో కొందరు తమ స్నేహితులకి సెల్‌ఫోన్లలో ఈ విషయం గురించి చెప్పారు. చాలామంది తమ కార్లను రాండాల్ వుల్ఫ్ ప్రదర్శనశాల వైపు మళ్ళించారు. కొంత సందేహించిన తర్వాత అధికారులు బెనర్జీ చెప్పిన చోట తవ్వించి చూశారు. మట్టిలో దాదాపు జీర్ణమైపోయిన అస్థికల అవశేషాలు కనబడ్డాయి. రంగుల రాళ్ళూ, పగడపు ఉంగరమూ దొరికాయి. మరిన్ని సెల్‌ఫోన్ కాల్స్ అక్కణ్ణుంచి ఆరంభమై దేశమంతటా అల్లుకుపోయాయి. సాయంత్రమయ్యేసరికి అన్ని టీ.వీ. ఛానెళ్ళలోనూ ఇదే వార్త!

శాంటాఫే మిషన్ హాస్పిటల్లో చేర్పించబడ్డ బెనర్జీకి ఆ రాత్రిక్కాని మెలకువ రాలేదు. "ఏమిటీ, ఎక్కడున్నాను?" అన్న అతని మొదటి ప్రశ్నకి డాక్టర్లేదో సర్ది చెప్పారు.

అతని శరీరానికి ఎన్నో సెన్సర్స్ (స్పందన పరికరాలు) తగిలించి, ఎన్నో ప్రశ్నలడిగి, ఎన్నో పరీక్షలు చేశారు. ఈ సంఘటన ఓ వాస్తవమైన అసంభవమనీ, అసంభవమైన వాస్తవమనీ నిర్ధారించారు.

బెనర్జీని, అతనితో బాటు బృంద నాయకుడు మాధవ్ షిండేని తమ అతిథులుగా మరో వారం రోజులు ఉంచుకోవడానికి అమెరికా అనుమతించింది. ఓక్లహోమా రాష్ట్రంలోని 'తుల్సా' నగర శివార్లలో ఉన్న ఓ పెద్ద హాస్పిటల్లో బెనర్జీని మరిన్ని పరీక్షలకి గురిచేసి అక్కడి డాక్టర్లు శాంటాఫే వారి అభిప్రాయాన్నే బలపర్చారు.

అమెరికాలోని చర్చికీ, న్యాయస్థానానికీ ధర్మసంకటాలుద్భవించాయి. రాండాల్ వుల్ఫ్ హత్య కేసు ముడి విప్పినందుకు అతనికి బంగారు నాణేలతో కంచుపాత్రను బహుకరించాలా, వద్దా? న్యాయాన్ని తన చేతిలోకి తీసుకొని వుల్ఫ్‌ని హత్యచేసినందుకు బెనర్జీకి ఈ జన్మలో ఏ చట్టప్రకారం శిక్ష విధించాలి? వారికి సరైన పరిష్కారం దొరకక, భారత ప్రభుత్వాన్ని ధార్మిక, న్యాయసలహాల కోసం అర్థించింది.

'ఇన్ని సంవత్సరాల కాలంలో ఎన్ని జన్మలెత్తాడోకాని, అతని పాపప్రక్షాళనమయిపోయి ఉంటుంది. కాబట్టే, స్వర్గతుల్యమైన మీ అమెరికాని స్వంత సొమ్ముతో కాక ప్రభుత్వం ఖర్చు మీద సందర్శించగలిగాడు! అతను శిక్షార్హుడు కాదు' అంది ధర్మసంఘం.

'మా దేశంలో పట్టపగలు నడిరోడ్డు మీద నలుగురెదుటా మనుషుల్ని నరికిపారేసినా, జనాలు సాక్ష్యాలివ్వడానికి ముందుకురాని కారణంగా, ఆధారాల్ని అధ్వాన్నం చేసి ముందుపెట్టిన కారణంగా ఈ జన్మలోనే శిక్ష విధించలేకపోతున్నాం. మీరు బెనర్జీని నిస్సంకోచంగా విడుదలచేసి, నాణేలలోని బంగారం విలువ చూడకుండా నాణేల ప్రాచీనతకు అత్యధికంగా విలువ కట్టి, ఆ సొమ్ముని భారత ప్రభుత్వానికి అందజేస్తే అన్నివిధాలా బావుంటుంది' అంది న్యాయవ్యవస్థ.

బెనర్జీ కారణంగా తనకూ రాజమర్యాదలు జరిగాయని మనసులో అనుకొన్నా, కృతజ్ఞతాపూర్వకంగా ఒక్కమాట కూడా షిండే పెదవి దాటి రాలేదు.

రాండాల్ వుల్ఫ్ వస్తుప్రదర్శనశాలలో బెనర్జీ కంచువిగ్రహాన్నుంచడం జరిగింది. అక్కడికి వచ్చే దర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

2204వ సంవత్సరంలో ఓ డిసెంబరు శనివారం ఉదయం పదింటికి ఆ రెండు కంచువిగ్రహాల్నీ, రాసి ఉంచిన వివరాల్నీ చూసిన భారతీయ పర్యాటక బృందంలోని నర్సాపురం నరసింహారావు "ఇదంతా బూటకం! రాండాల్ వుల్ఫ్ నిజస్వరూపం తనకు తెలుసునని, అతన్ని బెదిరిస్తూ రాసిన ఓ ఆకాశరామన్న ఉత్తరం థామ్సన్‌కి పాత పుస్తకాల్లో లభించింది. అదీకాక, కొడుకు ఆండ్రూ కంచుపాత్ర సీలుని నేర్పుగా తొలగించి నాణేల్ని తస్కరించడం ఓనాడు గమనించిన థామ్సన్ – ఏదో ఒకరోజున చోరీ బయటపడితే తన వంశ మర్యాద భంగపడుతుందన్న భయంతో, ఆ బహుమానాన్ని ఓ కొలిక్కి తీసుకువచ్చే ఉద్దేశ్యంతో పథకం వేసి, భారతీయ బృందానికి మార్గదర్శకుడిగా వ్యవహరించిన డేవిడ్ సహాయంతో బెనర్జీని ఒప్పించి ఆ నాటకం ఆడించాడు. చెట్టుదగ్గర తగిన ఆధారాల్ని పాతిపెట్టాడు. ఓ సమస్య తీరడమే కాకుండా ఆ పురావస్తు ప్రదర్శనశాల ఖ్యాతి పెరిగింది!"

అక్కడున్న దర్శకులలో కలకలం చెలరేగింది. ప్రదర్శనశాల ముఖ్య పర్యవేక్షకుడు, "అలా జరిగిందని నిర్ధారణగా ఎలా చెప్పగలరు?" అని ప్రశ్నించాడు.

"మొదటిసారిగా దొంగతనం చేసినప్పుడు ఆ కంచుపాత్రలో అయిదు వందల బంగారు నాణేలు ఉంచి భద్రపరుస్తున్నట్టుగా పదిమంది సంతకాలు చేసి ఉంచిన ఓ పత్రం ఆండ్రూకి లభించింది. ఆండ్రూ దాన్ని తన వద్ద దాచాడు. థామ్సన్ మరణించిన తర్వాత, ఆండ్రూ తండ్రి పుస్తకాల్లో ఉన్న ఆకాశరామన్న ఉత్తరాన్ని కూడా తీశాడు. జరిగిందంతా మరో ఉత్తరంలో రాసి, మొత్తం ఆ మూడు పత్రాల్నీ ఓ యిత్తడి గొట్టంలో దాచి, అదుగో, ఎదురుగా ఉన్న ఆ గుర్రం చిత్రం వెనుక గోడలో కన్నం చేసి, దాచి మళ్లీ మట్టితో మెత్తేశాడు. రాబోయే కాలంలో ఏనాటికైనా జనాలకి నిజం తెలియాలని ఆండ్రూ ఉద్దేశ్యం."

"నీ మాటలు ఎందుకునమ్మాలి? ఎలా నమ్మాలి?" ఎవరో ప్రశ్నించారు.

"ఎందుకంటే ఆ ఆండ్రూని నేనే! ఎలా అంటే ఆ గోడని నేను చెప్పిన చోట కాస్త తవ్వి చూడండి..." అంటూ నరసింహారావు స్పృహ తప్పిపడిపోయాడు.

అందరి సమక్షంలో గోడ తవ్వితే యిత్తడి గొట్టం బయట పడింది. అందులో నరసింహారావు చెప్పినట్టుగా మూడు పత్రాలు లభించాయి. రెండు పత్రాలు నాలుగు వందల సంవత్సరాల నాటివనీ ఆండ్రూ రాసిన ఉత్తరం రెండు వందల సంవత్సరాల నాటిదనీ పరీక్షలు తేల్చిచెప్పాయి!

రాండాల్ వుల్ఫ్ ప్రదర్శన శాల ఖ్యాతి అంబరాన్నంటింది. ప్రపంచమంతా విస్తుబోయినా ప్రభుత్వం మారినప్పుడల్లా చరిత్రల్ని మార్చే భారత దేశం మట్టుకు విస్తుపోలేదు.

*(కొమ్మూరి సాంబశివరావు స్మారక పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ)*